# విపక్షం బేజారు.. బీఆర్‌ఎస్ జోరు

- బీఆర్‌ఎస్‌తోనే భవిష్యత్తు అంటూ.. జాగ్రత్త పడుతున్న విపక్ష నేతలు
- స్వచ్ఛందంగా వచ్చి కారెక్కుతున్న బీజేపీ, కాంగ్రెస్ క్యాడర్
- చేరికలతో జోష్ మీదున్న గులాబీ సైన్యం

**గులాబీ అభ్యర్థులకు పెరుగుతున్న మద్దతు** ● **షెడ్యూల్ వెలువడినా.. ప్రతిపక్షాల్లో కానరాని సందడి**

సిటీబ్యూరో, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ ): గ్రేటర్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థులకు రోజురోజుకూ మద్దతు పెరుగుతోంది. కాలనీలు, అసోసియేషన్లు, బస్తీ కమిటీలు, వ్యాపార రంగాలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి బీఆర్‌ఎస్ అభ్యర్థులకు మద్దతు ప్రకటిస్తున్నారు. మా సీఎం కేసీఆరే., మా ఓటు బీఆర్‌ఎస్‌కే.. అంటూ ఏకగ్రీవ తీర్మానాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అభ్యర్థుల పార్టీ కార్యాయాలు గులాబీమయంగా మారుతున్నాయి. ఇప్పటికే అభ్యర్థులు క్షేత్రస్థాయిలో ఒక దఫా ప్రచారాన్ని పూర్తి చేశారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నారు. ప్రచారంలో ఇతర రాజకీయ పక్షాల కన్నా ముందంజలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు బీఆర్‌ఎస్‌కు బ్రహ్మరథం పడుతున్నారు. దీంతో అన్ని వర్గాల ప్రజలతో పాటు విపక్ష పార్టీల నేతలు గులాబీ కండువా కప్పుకునేందుకు పోటీ పడుతున్నారు. గ్రేటర్‌లో అన్ని స్థానాల్లో గులాబీ జెండా ఎగురవేసి 'తీన్మార్' మోగించడమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తోంది. విపక్షాల వ్యూహాలను చిత్తు చేస్తూ బీఆర్‌ఎస్ ప్రచార పర్వానికి తెర తీసింది. అందరూ ఒక్క తాటిపైకి వచ్చి భారీ మెజార్టీ లక్ష్యంగా కార్యాచరణతో ముందుకెళ్తున్నారు.

### విపక్షాల్లో ఆందోళన..

ఎటు చూసినా గులాబీ శ్రేణుల ప్రచారం కనిపించడంతో.. విపక్ష పార్టీల కార్యకర్తల్లో ఆందోళన మొదలైంది. ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీలో అభ్యర్థుల కరువు కనిపిస్తోంది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించి రోజులు గడుస్తున్నా.. ప్రతిపక్ష పార్టీలు తమ అభ్యర్థులను ఇప్పటికీ ప్రకటించలేదు. ఇప్పట్లో అభ్యర్థులేవరో తేలేలా లేదని ఆ పార్టీల నేతలు మండిపడుతున్నారు. పార్టీని నమ్ముకొని పనిచేస్తున్నా.. టికెట్ ఎంపికలో మాత్రం వలస నేతలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపిస్తున్నారు. అందులో బీసీ నేతలకు ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో కోపంతో ఉన్నారు. ఇప్పట్లో అభ్యర్థుల లెక్క తేల్చరంటూ.. ఆ పార్టీలను వీడి బీఆర్‌ఎస్‌తోనే భవిష్యత్తుగా భావిస్తూ స్వచ్ఛందంగా వచ్చి కారెక్కుతున్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలతో అభివృద్ధి సాధ్యం కాదని, బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని చెబుతున్నారు. ఈ అభివృద్ధిలో మేము సైతం.. అంటూ గులాబీ కండువా కప్పుకుంటున్నారు.



కాంగ్రెస్, బీజేపీ నేతలకు బీఆర్‌ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి మల్లారెడ్డి

## కాంగ్రెస్, బీజేపీ దివాలా కోరు పార్టీలు

### మంత్రి చామకూర మల్లారెడ్డి

శామీర్‌పేట, అక్టోబర్ 13 : తెలంగాణలోనే కాదు దేశంలో కూడా కాంగ్రెస్, బీజేపీలు దివాలా తీస్తున్నాయని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని పలు గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నేతలు శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి మంత్రి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్శితులై ప్రతిపక్ష పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. అభివృద్ధిని కాంక్షించే ప్రతి ఒక్కరికీ బీఆర్‌ఎస్ రెడ్ కార్పెట్ పరుస్తుందన్నారు. పార్టీ కోసం పని చేస్తున్న ప్రతి ఒక్కరికీ సముచిత న్యాయం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎండీ. జహంగీర్, నియోజకవర్గ ఇన్‌చార్జి చామకూర మహేందర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్ గుర్క కుమార్ యాదవ్, ఉప సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సుజాత, వార్డు సభ్యుడు రాజు, గ్రామ అధ్యక్షులు వెంకటేశ్, శ్రీనివాస్‌గౌడ్, నాయకులు మన్మచారి, సంతోష్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, ఇమ్రాన్, రాము, హరిమోహన్‌రెడ్డి, భిక్షపతి, దత్తుగౌడ్, వెంకటేశ్, హరి, మల్లేశ్, చంద్రశేఖర్, నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ నుంచి ..

మూడుచింతలపల్లి మండలం కొల్తూర్ గ్రామానికి చెందిన నర్సింహులు, రాజయ్య, శామీర్‌పేట మండలం అలియాబాద్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కిట్టు రెడ్డి, మల్లారెడ్డి, నరేశ్, శివ, మహేశ్, లోకేశ్, సాయి, ఆదిత్య, సిద్ధు, కిరణ్‌తో పాటు మరో 50 మంది బీఆర్‌ఎస్‌లో చేరగా.. మంత్రి మల్లారెడ్డి, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చామకూర మహేందర్‌రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

చుట్టపు చూపు నాయకులను కాదు..

## అందుబాటులో ఉంటేనే ప్రజలు విశ్వసిస్తారు

**బీఆర్‌ఎస్‌లోకి భారీగా చేరికలు** ● **మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్**



బీఆర్‌ఎస్‌లో చేరిన సుప్రభాత్‌నగర్ యువకులతో మంత్రి తలసాని

అమీర్‌పేట, అక్టోబర్ 13: నియోజకవర్గానికి చుట్టపు చూపుగా వచ్చి పోయే నాయకుల కంటే.. నిత్యం తమతో కలిసి ఉండే వారినే ప్రజలు కోరుకుంటున్నారని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. అమీర్‌పేట సుప్రభాత్‌నగర్‌కు చెందిన యువకులు శుక్రవారం మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి నేతృత్వంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రజలు స్వయంగా చూస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో మాయమాటలతో వస్తున్న వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో బీఆర్‌ఎస్ పార్టీ మూడోసారి కూడా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమన్నారు. అభివృద్ధిని కోరుకుంటున్న ప్రజలు బీఆర్‌ఎస్‌కు అండగా నిలుస్తున్నారన్నారు. సుప్రభాత్‌నగర్‌కు చెందిన రాజేశ్, హరీశ్‌ల తోడ్పాటుతో కిరణ్ కుమార్, శ్రీనివాస్ నాయుడు, వర్మ, మోహన్, ఆదికేశవ నాయుడు, శ్రావణ్ తదితరులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ అధ్యక్షులు ఎం.హనుమంతా రావు, ప్రధాన కార్యదర్శి సంతోష్ మణికుమార్, నాయకులు అశోక్ యాదవ్, జితేందర్ శుక్లా తదితరులున్నారు.

## బీజేపీ నుంచి బీఆర్‌ఎస్‌లోకి..



బీజేపీ నుంచి బీఆర్‌ఎస్‌లోకి చేరిన మహిళలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్, అక్టోబర్13: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల విలేజ్‌కి చెందిన బీజేపీ నాయకురాలు, వార్డు సభ్యురాలు బేకు శ్యామల తన అనుచరులతో కలిసి శుక్రవారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ సారథ్యంలో మహిళలకు అన్ని రంగాల్లో అవకాశాలు కల్పించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నేతలు సంపత్ మాధవరెడ్డి, కుంట సిద్దిరాములు, సుధాకర్‌గౌడ్, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, గుమ్మడి మధుసూదన్ రాజ్, కాలే నగేశ్, బేకు ఆనంద్, ఇందిరారెడ్డి, ఎల్లేశ్వరి, బాలమణి, ప్రమీల, లక్ష్మి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే ..అన్ని మతాలకు సమ ప్రాధాన్యం

### ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్




బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్, అక్టోబర్ 13: బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే సమాజంలో అన్ని కులాలు, మతాలకు సమాన ప్రాధాన్యత లభిస్తుందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. వెంకటేశ్వరకాలనీ పరిధిలోని షాకత్‌నగర్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు పీటర్ ప్రకాశ్ పాల్‌తో పాటు పలువురు శుక్రవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదలకు అండగా నిలుస్తూ దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో తెలంగాణ పథకాలను అమలు చేసే దమ్ములేకున్నా.. ఇక్కడికి వచ్చి మతాల మధ్యన చిచ్చుపెట్టేలా వ్యాఖ్యలు చేయడం ఆ పార్టీ నాయకులకు అలవాటుగా మారిందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరు గ్యారంటీలు అంటూ హంగామా చేస్తున్నారని, నియోజకవర్గంలో ఏ అభ్యర్థి ఎన్నికల్లో నిలబడతాడనే విషయాన్నే తేల్చుకోలేని కాంగ్రెస్ నాయకులు ఇచ్చే గ్యారెంటీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఎవరెన్ని మాయమాటలు చెప్పినా మరోసారి బీఆర్‌ఎస్ పార్టీ మాత్రమే అధికారంలోకి వచ్చి తీరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీలో చేరిన యోహాన్, సుభాష్, గౌసుద్దీన్‌తో పాటు స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు పాలడుగు శ్రీనివాస్, గుండు శ్రీనివాస్, సామ నర్సింగ్‌రావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## 300 మంది మహిళలు చేరిక

### బీఆర్‌ఎస్ పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



అంబర్‌పేట, అక్టోబర్ 13: దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా అనేక సంక్షేమ పథకాలు సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. అంబర్‌పేట నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి చాలా మంది బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని చెప్పారు. బాగ్‌అంబర్‌పేట డివిజన్ బతుకమ్మకుంటకు చెందిన శోభారాణి ఆధ్వర్యంలో 300 మంది మహిళలు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంబర్‌పేట ప్రజలను ఏనాడూ పట్టించుకోని మంత్రి కిషన్ రెడ్డి ముసిముసి నవ్వులతో మళ్లీ వస్తాడని, నవ్వులు చూసి మోసపోవద్దని ప్రజలను కోరారు. ఎంపీ ఎన్నికల్లో అంబర్‌పేట నియోజకవర్గం నుంచి ఆయనకు 40వేల మెజార్టీ వచ్చిందని, ఇక్కడి ప్రజలు ఆయనకు మెజార్టీ ఇచ్చి గెలిపిస్తే కేంద్ర మంత్రి పదవి పొందిన తర్వాత అంబర్‌పేట ప్రజలను, పార్టీ కార్యకర్తలను పూర్తిగా విస్మరించారని ఎమ్మెల్యే విమర్శించారు.